క్లుప్తంగా

స్వచ్ఛ దుబ్బాకే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్



మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ రమేశ్ కుమార్

దుబ్బాకటౌన్: స్వచ్ఛ దుబ్బాకే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్ అన్నారు. దుబ్బాక పట్టణంలో 14వ వార్డులోని రెడ్డిసంఘం సమీపంలో మురుగు కాలువ కూలిపోవడంతో శిథిలాలు పేరుకుపోయాయి. దీంతో విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం కౌన్సిలర్ ఆస యాదగిరితో కలిసి కాలువను పరిశీలించారు. వెంటనే జేసీబీ సహాయంతో శిథిలాలను తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువను నూతనంగా నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ప్రవీణ్ కుమార్ తదితరులున్నారు.

ఆశావర్కర్లపై నిర్లక్ష్యం తగదు



అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉమారెడ్డి

సిద్దిపేటరూరల్: జాప్యం లేకుండా ఆశావర్కర్లకు వేతనాలు ఇవ్వాలని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశావర్కర్లపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలన్నారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, సుమతి, కళావతి, రాణి, నర్సమ్మ, నాగజ్యోతి, వినోద, మమత, సరిత పాల్గొన్నారు.

24న మెగా జాబ్‌మేళా

కోహెడరూరల్(హుస్నాబాద్): మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూలం శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మంగళవారం మండలంలోని వింజపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చొరవతో నిరుద్యోగులకు యువజన సర్వీస్‌శాఖ ఆధ్వర్యంలో 24న తిరుమల గార్డెన్‌లో ఉదయం 10గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నారని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉచిత శిక్షణ

జిల్లా ఎస్సీ వేల్ఫేర్ ఆఫీసర్ కవిత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ప్రిలిమ్స్ పరీక్షకు అందించనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ వేల్ఫేర్ ఆఫీసర్ కవిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ స్టడీసర్కిల్‌లో వసతితో కూడిన ఉచిత శిక్షణ అందిస్తారని తెలిపారు. డిగ్రీ పూర్తిచేసి రూ.3లక్షలలోపు వార్షిక ఆదాయం ఉన్న అభ్యర్థులు 7నుంచి జూలై 10వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, జూలై 27న ప్రవేశపరీక్ష నిర్వహించి సీట్లను కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థులు

సిద్దిపేటకమాన్: నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని విద్యార్థి సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో పీడీఎస్‌యూ, ఎన్‌ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రధాని మోదీ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వాకం వల్ల దేశవ్యాప్తంగా 24లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని ఆరోపించారు. ఇంత జరిగినా మోదీ స్పందించడం లేదని, తక్షణమే నీట్ పరీక్ష ఫలితాలను రద్దుచేసి దాని నిర్వహణను రాష్ట్రాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ విషయంపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు.

భూములిచ్చాం.. బాధపడుతున్నాం

పునరావాస కాలనీలో సౌకర్యాలు కరువు

- అసంపూర్తిగా పాఠశాల, తాగునీటి ట్యాంక్
- విద్యుత్ సరఫరా అంతంత మాత్రమే
- కన్నెత్తి చూడని ఉన్నతాధికారులు

నిర్వాసితుల పునరావాస కాలనీలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తాగునీరు, విద్యుత్ సైతం అంతంత మాత్రంగానే ఉంది. ఆ అసౌకర్యాల నడుమే ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం కోసం భూములిచ్చిన తమకు ఈ గతిపట్టిందని, అధికారులు కనీసం కన్నెత్తి చూడడంలేదని నిర్వాసితులు వాపోతున్నారు.

– అక్కన్నపేట(హుస్నాబాద్)



మధ్యలోనే నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణ పనులు



అసంపూర్తిగా ఉన్న వాటర్ ట్యాంక్

మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టు కింద ముంపు గ్రామం గుడాటిపల్లి పరిధిలోని సుమారు ఐదు గిరిజనతండాల నిర్వాసితులకు నందారం స్టేజీ వద్ద గత ప్రభుత్వ హయాంలో పునరావాస కాలనీ ఏర్పాటు చేశారు. దాదాపు 185 కుటుంబాలకు సుమారుగా 250 చదరపు గజాల ఇండ్ల స్థలాలు కేటాయిస్తూ పట్టాలను అందజేశారు. దీంతో ఆ నిర్వాసితులంతా తమకు కేటాయించిన స్థలాల్లో ఇండ్ల నిర్మాణాలు చేపట్టారు.

నిలిచిన పనులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పునరావాస కాలనీలో పాఠశాల, సీసీ రోడ్లు, గుడి, డ్రైనేజీలను నిర్మించి అన్ని సౌకర్యాలను కల్పించాల్సి ఉంది. కానీ కేవలం పాఠశాల, సీసీ రోడ్లు, వాటర్ ట్యాంక్ నిర్మాణాలను మొదలుపెట్టి ఆ పనులను మధ్యలోనే వదిలివేశారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. కేవలం కొన్నిచోట్ల సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మించారు. దీంతో ఇండ్ల నిర్మాణ సమయంలో నిర్వాసితులు పడరాని అరిగోసను పడుతున్నారు.

ట్యాంకర్ వస్తేనే తాగునీరు

ప్రస్తుతం పునరావాస కాలనీలో ప్రజలకు దాహం తీర్చాలంటే ట్యాంకరే దిక్కుగా మారింది. పక్కనే ఓ వ్యవసాయబావిని లీజుకు తీసుకున్నట్లు ఎంపీడీఓ జయరామ్ చెప్పారు. అలాగే విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయకపోవడంతో 100నుంచి 200మీటర్ల దూరం వైర్లను కర్రల సహాయంతో ఏర్పాటు చేసుకొని విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ విలువైన భూములను ఇచ్చి వారు మాత్రం అసౌకర్యాల నడుమ బతకాల్సిన దుస్థితి నెలకొందని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం, తాగునీటి ట్యాంక్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని వారు వేడుకుంటున్నారు.

బిల్లులు రాక పనులు నిలిపివేశాం

సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం. పాఠశాల భవనం, వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను మధ్య లో నిలిపివేశాం. పనులకు బిల్లులు రాకపోవడంతో పనులన్నీ ఆగిపోయాయి. బిల్లులువస్తే తప్ప పనులు చేయలేని పరిస్థితిలో ఉన్నాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, పునరావాస కాలనీ కాంట్రాక్టర్

పిల్లలను పనులకు పంపించొద్దు

కాంగ్రెస్ నేత చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



కాశవాడలోని స్థానికులతో శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): పిల్లలను పనులకు పంపించకుండా విద్యావంతులుగా తీర్చిదిద్దాలని చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని తుక్కాపూర్ మదిర కాశవాడలో మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కాశవాడ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, పనులు వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వాటర్ ట్యాంకు నిర్మాణానికి రూ.30లక్షలు, బోరు మోటారు కోసం రూ.2లక్షలు మంజూరు చేయించామని తెలిపారు. అలాగే సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.5లక్షలు కేటాయించారని, అదనంగా మరో రూ.15లక్షలు మంజూరు చేయిస్తామని వారికి హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మండల అభివృద్ధి కోసం రూ.3కోట్లు మంజూరు చేయించామని చెప్పారు. కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ కో ఆర్డినేటర్ చెరుకు విజయ్‌రెడ్డి, దౌల్తాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి కనకయ్య, నాయకులు విజయ్‌పాల్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, కృష్ణ, స్వామి, మోదిన్, అమీర్, సాహు హుసేన్, బాబా, గోరేమియా పాల్గొన్నారు.

పోలీసులు ఇబ్బంది పెడుతున్నారు

కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్



మాట్లాడుతున్న చక్రధర్‌గౌడ్

సిద్దిపేటకమాన్: సిద్దిపేటలో కొంత మంది పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆ పార్టీ నేత చక్రధర్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట పట్టణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నకోడూర్ మండలం గంగాపూర్‌కు చెందిన కార్యకర్తపై తల్లిని చంపిన కేసు నమోదు చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం ఏమిటని ప్రశ్నించారు. ఆస్తికోసం తన తల్లిని చంపాడని పోలీసులు కేసు నమోదు చేశారని, కానీ గతంలోనే తన తల్లి చంద్రశేఖర్ పేరున ఆస్తిని రిజిస్టర్ చేసిందని చెప్పారు. ఈ ఘటనపైన సీపీ అనురాధకు ఫిర్యాదు చేశామని, త్వరలో డీజీపీకి కూడా ఫిర్యాదు చేశామన్నారు. అక్రమ కేసులు పెడితే ఊరుకోబోమని హెచ్చరించారు.

తేమ ఉన్నప్పుడే విత్తుకోవాలి

మండల వ్యవసాయ అధికారి మల్లేశం



వివరాలను అడిగి తెలుసుకుంటున్న మల్లేశం

మిరుదొడ్డి(దుబ్బాక): భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడే విత్తుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేశం సూచించారు. మిరుదొడ్డిలోని పీఏసీఎస్ కేంద్రంతోపాటు పలుగ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఎరువులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్తి స్థాయిలో వర్షాలు కురిసిన తర్వాతనే విత్తుకోవాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచామని చెప్పారు. యూరియాను అధిక మోతాదులో వాడితే పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈఓ సాయి కుమార్, పీఏసీఎస్ సీఈఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యం అవసరం

వైద్యాధికారి హరిత



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ హరిత

వర్గల్(గజ్వేల్): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 20న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో అందరూ భాగస్వాములై జయప్రదం చేయాలని వర్గల్ జెడ్పీటీసీ బాలూయాదవ్, ఎంపీపీ లత రమేశ్‌గౌడ్, వైద్యాధికారి డాక్టర్ హరిత కోరారు. మంగళవారం స్థానిక ప్రాథమికోన్నత ఆరోగ్య కేంద్రం, మహిళా సమాఖ్య భవనంలో వైద్యాధికారి వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఒకటి నుంచి 19సంవత్సరాల లోపు వారందరికీ 20న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో ఎంఎస్ఓ వెంకటేశ్వర్‌గౌడ్, ఎంపీఓ ఖలీం, ఐకేపీ సత్యనారాయణ, డాక్టర్ శిరీష, సీహెచ్ఓ వెంకటేశ్వరమ్మ, సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్)లో..

నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ బాలేషంగౌడ్ పిలుపునిచ్చారు. మండల కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సిబ్బంది నులి పురుగులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజశేఖర్, సత్యప్రకాశ్, ఎంపీడీఓ యాదగిరి, ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్దూరులో..

మండలంలోని లద్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెల 20న నులిపురుగుల నివారణకు మందులు పంపిణీ చేస్తున్నట్లు వైద్యాధికారి సుధీర్‌రాజ్ తెలిపారు. వైద్య సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో ఈ మందులు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.

రక్తహీనత నుంచి రక్షించండి

తొగుట(దుబ్బాక): నులి పురుగులను నివారించి పిల్లలను రక్తహీనత నుంచి కాపాడాలని మండల వైద్యాధికారి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక రైతువేదికలో మంగళవారం ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 20న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఎడాది నుంచి 19ఏళ్ల వయస్సు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని సూచించారు. మండలంలో 6124 మంది పిల్లలకు మాత్రలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిలిమ్స్‌కు లాంగ్‌టర్మ్ కోచింగ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో ప్రిలిమ్స్ పరీక్షకు లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణదయాసాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, హైదరాబాద్‌లోని లక్ష్మీనగర్ స్టడీసర్కిల్‌లో 100మందికి శిక్షణను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 19నుంచి జూలై 3వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తారని, నెలనెలా రవాణా ఖర్చులతో పాటు బుక్‌ఫండ్ అందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


చెట్ల తొలగింపు



చెట్లను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

మిరుదొడ్డి(దుబ్బాక): ఏపుగా పెరిగిన చెట్లతో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని లింగుపల్లి గ్రామస్తులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను మంగళవారం అధికారులు తొలగించే పనిలో పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న భగీరథ సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాం

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇంటింటి భగీరథ సర్వే ఆయా గ్రామాల్లో కొనసాగుతోంది. మంగళవారం మండలంలోని గౌరవెల్లి గ్రామంలో ఎంపీడీఓ భానోతు జయరాం సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్కన్నపేట మండలంలోని గొల్లకుంట, గొల్లపల్లి, మంచినీళ్లబండ, చాపగాని తండా, దుబ్బతండా, మసిరెడ్డితండా, కేశనాయక్ తండా, చౌటపల్లి, గుబ్బడి గ్రామాల్లో భగీరథ సర్వే పూర్తయినట్లు వెల్లడించారు. మిగిలిన గ్రామాల్లో మూడు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వర్షాల కోసం కూలీల బతుకమ్మ



బతుకమ్మ ఆడుతున్న కూలీలు

తొగుట(దుబ్బాక): వరుణదేవుడు కరుణించి వానలు కురిపించాలని కోరుతూ ఉపాధిహామీ కూలీలు బతుకమ్మ ఆటాడారు. మండలంలోని ఎల్లారెడ్డిపేటలోని తాటోని కుంటలో ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం పనులకు వెళ్లిన మహిళా కూలీలు పని పూర్తిచేసిన తర్వాత వరుణున్ని వేడుకుంటూ బతుకమ్మ ఆడారు. పత్తి, మొక్కజొన్న విత్తనాలు నాటి వారం రోజులు కావస్తున్నా వానలుకురవక మొలకలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ పాటలు పాడారు.

మట్టి రోడ్డుతో అవస్థలు



మండలంలోని కూరెళ్ల గ్రామంలోని మట్టిరోడ్డుతో స్థానికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పొడవునా అక్కడక్కడా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. గ్రామం నుంచి తంగళ్లపల్లి బీటీ రోడ్డుకు ఇది లింక్ రోడ్డు కావడంతో వాహనదారులు, బాటసారులు నిత్యం అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరుచేరి చెరువును తలపిస్తున్నాయి. కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

– కోహెడరూరల్(హుస్నాబాద్)

సీఎం చిత్రపటాల అందజేత



సీఎం చిత్రపటాన్ని ఎంపీపీ సాయిలుకు అందజేస్తున్న రాజేశ్

మిరుదొడ్డి(దుబ్బాక): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మద్దెల రాజేశ్ తన సొంత ఖర్చులతో తయారు చేయించిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటాలను మిరుదొడ్డి మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు మంగళవారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో విధిగా సీఎం చిత్ర పటాలు ఉండాలన్న ఉద్దేశ్యంతో రేవంత్‌రెడ్డి ఫోటోలను అందజేశామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాసంక్షేమ పథకాలను గడపగడపకు చేరేవిధంగా తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలు, మాజీ సర్పంచ్‌లు కనకారెడ్డి, కిష్టయ్య, శంకర్, మాజీ ఏఎంసీ చైర్మన్ భూమాగౌడ్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, కాంగ్రెస్ నాయకులు సుదర్శనం, సురేశ్, మల్లేశం, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని ఎంపీటీసీ నముకు పిలుపునిచ్చారు. మంగళవారం దూల్మిట్ట మండలంలోని కొండాపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతనికి రాష్ట్ర ప్రభుత్వం అనేక నిధులు మంజూరుచేసి అభివృద్ధి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆలయ పరిసరాలలో అవస్థలు

కొముురవెల్లి(సిద్దిపేట): కొముురవెల్లి ఆలయ పరిసరాలలోని వెనుక మెట్ల ప్రాంతంలోని డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. కొన్నిరోజులగా ప్రసాద తయారీ కేంద్రం నుంచి వ్యర్థాలను డ్రైనేజీలోకి వదలడంతో మ్యాన్‌హోల్ చెత్తచెదారం నిండిపోయింది. దీంతో పరిసర ప్రజలు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. ఉన్నత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

◆ ఇంపాక్ట్ ఫౌండేషన్ ట్రైనర్‌గా శశిధర్‌శర్మ

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ గంప నాగేశ్వర్‌రావు స్థాపించిన ఇంపాక్ట్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ (ఐసీఐ)ట్రైనర్‌గా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు, జగదేవ్‌పూర్‌కు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు శశిధర్‌శర్మ ఎంపికయ్యారు. గత 45 రోజులుగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన ట్రైనింగ్‌లో ఆయన ఉత్తమ ప్రతిభ చాటారు. దీంతో శశిధర్‌శర్మను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగేశ్వర్‌రావు అభినందించి సర్టిఫికేట్ అందించారు.

◆ వైభవంగా స్వాతి నక్షత్ర మహోత్సవం

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధపుణ్యక్షేత్రం నాచగిరిలో స్వాతి నక్షత్ర మహోత్సవం వైభవంగా జరిగింది. జన్మ నక్షత్రం సందర్భంగా ఉదయం గర్భగుడిలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్టులకు ఈఓ అన్నపూర్ణ పర్యవేక్షణలో ఆలయ అర్చక, వేదపండిత పరివారం విశేష పంచామృత అభిషేకం జరిపారు. అనంతరం దేవతామూర్తులను పట్టువస్త్రాలు, సర్వాభరణాలు, పూలమాలికలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవమూర్తులను హోమశాలకు తీసుకెళ్లి నారసింహ సుదర్శన మూలమంత్ర హవనం, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు.

◆ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

గజ్వేల్‌రూరల్: ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య తెలిపారు. 20వ వార్డులో కౌన్సిలర్ గోపాల్‌రెడ్డితో కలిసి మంగళవారం మురుగు కాలువలను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. వైకుంఠధామం, పాండవుల చెరువు, 2వ వార్డులో నూతన సీసీరోడ్డు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వేలం ఆదాయం రూ.3.43లక్షలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో మంగళవారం నిర్వహించిన కూరగాయలు, పశువుల సంతల వేలానికి రూ.3.43లక్షల ఆదాయం వచ్చినట్లు కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి తెలిపారు. కూరగాయల వారపుసంత రాగుల ఏలేందర్ రూ.2.53 లక్షలకు, రూ.90వేలతో పశువుల సంతను రాజేశంగౌడ్ పొందారు.

బెజ్జంకి ఇన్‌చార్జి ఎంఈఓగా యాదవరెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ఇన్‌చార్జి ఎంఈఓగా ఎస్.యాదవరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈఓగా ఉన్న పావని సెలవుపై యూఎస్ వెళ్లారు. తిరిగివచ్చే వరకు యాదవరెడ్డి బాధ్యతలు నిర్వహిస్తారు.

నేడు విద్యుత్ అంతరాయం

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం మజీద్‌పల్లి 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం ఉదయం 8.00 గంటల నుంచి 10.30వరకు నిర్వహణ, మరమ్మతు పనులు చేపడుతున్నట్లు విద్యుత్ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఆ సమయంలో మజీద్‌పల్లి, గిర్మాపూర్, మాదారం, సామలపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చర్యలు తీసుకోవాలి..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తిమ్మలకుంట చెరువు తూమును ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లింగారెడ్డిపల్లికి చెందిన ముదిరాజ్ కులస్తులు కోరారు. మంగళవారం నీటిపారుదలశాఖ అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. ముదిరాజ్ ఆలయ కమిటీ అధ్యక్షుడు బోనాల ఉప్పలయ్య, ఉపాధ్యక్షుడు తాటికొండ రమేశ్ తదితరులు మాట్లాడుతూ తూమును ధ్వంసం చేయడంతో తమ ఆధారం కోల్పోయామని వాపోయారు. వేణు, శేఖర్, రాజు, రవి, శ్రీనివాస్, లక్ష్మణ్, యాదగిరి, నర్సింహులు, రమేశ్, అమరేందర్, సంజీవులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎడిట్ ఆప్షన్‌లేక అవస్థలు

కొముురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వం అమలుచేస్తున్న గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ల పథకాలు అందని లబ్ధిదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. దరఖాస్తులను పునఃపరిశీలన చేసేందుకు ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో అధికారులు లబ్ధిదారులను తిరిగి పంపిస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో కౌంటర్‌లను ఏర్పాటుచేసినా ఫలితంలేదని వాపోతున్నారు.

ఇసుక వేలం

చేర్యాల(సిద్దిపేట): పలు గ్రామాల్లో సీజ్‌చేసి తహసీల్దార్ కార్యాలయంలో డంప్‌చేసిన పది ట్రాక్టర్ల ఇసుకను గురువారం ఉదయం వేలం నిర్వహిస్తున్నట్లు ఆర్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. కావాల్సిన వారు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

మాజీ సర్పంచ్‌కు స్వర్ణ కంకణధారణ

కొండపాక(గజ్వేల్): తిమ్మారెడ్డిపల్లి మాజీ సర్పంచ్, వాస్తు జ్యోతిష్య పురోహితుడు బుర్గోజు బాలబ్రహ్మంను స్వర్ణ కంకణధారణతో సన్మానించారు. ఇటీవల తెలుగు సంస్కృతి సాహితీ సేవాట్రస్టు ఫౌండర్, వర్దన్నపేట ఎమ్మెల్యే నాగరాజు చేతుల మీదుగా సన్మానం పొందారు. దేవాదాయ ధర్మాదాయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, ప్రభాకరచారి, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.